



# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక







సంపుటి: 01 సంచిక : 262. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.06.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## వీఆర్వో, వీఆర్ఏలకు మరోసారి జీపీవో పరీక్ష



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో), విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ)లకు జీపీవో(గ్రామపరిపాలన అధికారి)గా అవకాశం కల్పించేందుకు మరోసారి అర్హత పరీక్ష నిర్వహించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వీఆర్ఏ, వీఆర్వోలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ సంఘాలతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు పాత రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. "భూ భారతి ఫలితాలు ప్రతి పేదవాడికి చేరేలా చట్టం అమలుకు క్షేత్రస్థాయిలో పని చేయండి. పదవులు శాశ్వతం కాదు. తీసుకున్న సంస్కరణలు విధానపరమైన నిర్ణయాలు పదిమందికి మేలు జరిగేలా ఉండాలి" అని పొంగులేటి అన్నారు. ఆ క్రమంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. రామ్‌రెడ్డి,వి. భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జేఏసీ హర్షం

వీఆర్ఏ, వీఆర్వోలకు జీపీవోలుగా అవకాశం కల్పించేందుకు మరోసారి అర్హత పరీక్ష నిర్వహించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం పట్ల తెలంగాణ ఉద్యోగ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రితో జరిగిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల సమావేశంలో క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించినట్టు తెలిపారు. జీపీవోలకు ప్రతి రెవెన్యూ గ్రామంలో కార్యాలయ స్థలం కేటాయింపు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి నాయబ్ తహసీల్దార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగుల జాబ్ చార్ట్ రూపొందించాలని కోరినట్టు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

## సీజనల్ వ్యాధులను నియంత్రించాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులకు సూచించారు. డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరుతో ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు తసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన సీజనల్ వ్యాధుల నివారణ, నియత్రణపై సమీక్షించారు. రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులొచ్చాయనీ, దీంతో ఈ ఏడాది మే, జూన్ నుంచే అక్కడక్కడా సీజనల్ వ్యాధులు మొదలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగ్యూ కేసులు తక్కువగా నమోదయ్యాయనీ,అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయని అన్నారు. గతేడాదితో పోలిస్తే టైఫాయిడ్ కేసులు కూడా చాలా తక్కువగా నమోదయ్యాయన్నారు.

యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలి

కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల్లో, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆయా వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జీహెచ్ఎంసీ జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో సమీక్షించాలని హెల్త్ సెక్రెటరీకి మంత్రి సూచించారు. ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలనీ, ఐటీడీఏ పీవోలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు ఎక్కు వగా నమోదవుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతా ధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన పేషెంట్లకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో అవసరమైన అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. అన్ని ఆస్పత్రుల్లో అవసరమైన అన్ని రకాల ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి సూచిం చారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టే, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఒకవేళ సీజనల్ వ్యాధుల బారినపడితే, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సేవలను ఉపయోగించుకోవాలనీ, అక్కడ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## బనకచర్ల పాపం బీఆర్ఎస్‌దే




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బనకచర్ల ప్రాజెక్టు పాపం బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ఆరోపించారు. ఆనాడు సంతకాలు పెట్టిన నాయకులే ఇప్పుడు తమ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆంధ్రా ప్రజలను తిట్టిన బీఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చాక వారి కాళ్లకు ముళ్లు గుచ్చుకుంటే పంటితో తీస్తామన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు రాగానే బీఆర్ఎస్ ప్లేట్ ఫిరాయించిందని తెలిపారు. తెలంగాణ నీటి వాటాను తరలించుకుపోయిన నీటి దొంగలను కేసీఆర్ తన నివాసానికి పిలిచి ఎందుకు భోజనం పెట్టారని ప్రశ్నించారు. ఆయనకు ఇక్కడ కోడి పులుసు తినిపిస్తే ఈయనకు అక్కడ చేపల పులుసు తినిపించారని ఎద్దేవా చేశారు. ఆనాడు బీఆర్ఎస్ వ్యవహరించిన తీరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుపడుతూ మాట్లాడారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చకు రమ్మంటే, కేటీఆర్ మాత్రం ప్రెస్‌క్లబ్ రమ్మంటున్నారని విమర్శించారు.కొన్ని రోజులైతే కల్లు దుకాణం వద్ద చర్చకు రమ్మంటారేమోనని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సెకండ్ బెంచ్ నాయకులనీ, అటువంటి వారు కేసీఆర్, రేవంత్‌రెడ్డి మధ్యలో ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ రేవంత్ రెడ్డి బొట్టుపెట్టి పిలుస్తుంటే, ఎందుకు రావడం లేదని ఆయన నిలదీశారు.

## క్యాన్సర్ బాధితురాలికి ఎల్‌వోసీ చేయూత

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న 'మంత్రుల ముఖాముఖి' కార్యక్రమంలో భాగంగా కొద్దినెలల క్రితం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన రామకృష్ణ చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించారు. తన భార్య క్యాన్సర్ లంప్‌తో బాధపడుతున్నారనీ, ఆమె వైద్యానికి ఆర్థిక సాయం చేయాలంటూ రామకృష్ణ చేసిన వినతికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించి ఆమెకు ఎల్‌వోసి అందజేశారు. దీంతో రామకష్ణ తన భార్యకు ఐదుసార్లు కీమో థెరపీ చేయించగలిగారు. చికిత్స అనంతరం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె క్యాన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి పొందారని వైద్యులు నిర్ధారించారు. దీంతో భర్త రామకృష్ణ శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో తన కుటుంబం నిలబడిందంటూ ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. క్యాన్సర్‌ను విజయవంతంగా జయించినందుకు ఆ కుటుంబానికి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.ఇదిలా ఉండగా రామకృష్ణ హైదరాబాద్‌లో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన భార్యను ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కొంతకాలం చికిత్స పొందిన తర్వాత వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఆ కుటుంబానికి ఏర్పడింది. ఆ సమయంలో గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమంలో ఆయన తన ఆవేదనను వెళ్లబోసుకున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం వెంటనే స్పందించి ఆమెకు ఎల్‌వోసీ ఇచ్చారు. అంతేకాకుండా మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. చికిత్స పొందుతున్న ఆమె యోగక్షేమాలు ఎప్పటికప్పుడు

## ఢిల్లీ పాలకులు దిగొచ్చేలా రైల్ రోకో



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఢిల్లీ పాలకులు దిగివచ్చేలా రైల్ రోకో నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఈ ఉద్యమంలో పౌర సమాజం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్ రోకోకు భీం ఆర్మీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. భీం ఆర్మీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆయాజ్ ఆధ్వర్యంలో నాయకులు బంజారాహిల్స్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. రైల్ రోకోకు భీం ఆర్మీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ మద్దతు ప్రకటించారని తెలిపారు. రైల్ రోకోలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు సాధించడంతో పాటు విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెట్టడం ఒక్కటే మార్గమన్నారు. రిజర్వేషన్ల పెంపు బిల్లులను రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించి కేంద్రానికి పంపిస్తే ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ప్రయత్నాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు కల్పించకుంటే కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, హన్మంతరావు, సురేశ్ కుమార్, యూపీఎఫ్ కో ఆర్డినేటర్ ఆలకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల రద్దు చేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర

రాష్ట్రంలో రేషన్ కార్డులను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం జూన్‌లో ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ చేసిందన్నారు. అనివార్య కారణాలతో 7.24 లక్షల కుటుంబాలు తీసుకోలేదని తెలిపారు. రేషన్ తీసుకోకపోవడాన్ని సాకుగా చూపుతూ ఏడు లక్షలకు పైగా కుటుంబాల రేషన్ కార్డులను తొలగించే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉందని ఆరోపించారు.

ఆ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. వారికి మరోసారి రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు.. రేషన్ కార్డులు తొలగించే ప్రయత్నాలు చేస్తే ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు

## శ్రమదోపిడీకి సర్కారు గ్రీన్‌సిగల్



హైదరబాద్ :అమృత్ తెలంగాణ: కష్టజీవుల చెమట చుక్కల్ని కరెన్సీగా మార్చుకోవడానికి కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈ విషయంలో మోడీ సర్కార్ బాటలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నడుస్తుంది. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే చాలు అంటూ ప్రపంచదేశాల్లో పర్యటనలు చేసి వస్తున్న ప్రభుత్వాధినేతలు, కార్పొరేట్ల కోసం కార్మికుల శ్రమను పణంగా పెడుతున్నారు. ఇప్పటికే చదివిన చదువుకు, చేస్తున్న పనికి సంబంధం లేకుండా యువతరం కారా?నాల్లో మగ్గుతోంది. మోడీ సర్కార్ నాలుగు లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే దేశంలో కార్మికులకు కనీస భద్రత, కనీస వేతనాలు, సెలవులు వంటి అనేక అంశాలను కోల్పోవాల్సి వస్తుందని జాతీయ కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ తరహా నిర్ణయం తీసుకోవడాన్ని ఆ సంఘాలన్నీ తప్పుపడుతున్నాయి. శ్రమదోపిడీకి 'ఈజ్ ఆఫ్ డూయింగ్' అంటూ పాలకులు ముద్దు పేరు పెట్టుకున్న విషయం తెలిసిందే.

అప్పట్లో అదేం లేదన్న కార్మిక మంత్రి

రాష్ట్రంలో పదిగంటల పనివిధానాన్ని అమల్లోకి తెస్తారా అని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలో 'నవతెలంగాణ' ప్రతినిధి ప్రశ్న అడిగారు. అలాంటిదేం లేదంటూ ఆయన కొట్టిపారేశారు. వారం తిరక్కుండా పదిగంటల పనివిధానంపై ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సమ్మెలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ కూడా పాల్గొంటున్నది. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు.

ఇప్పటి వరకు

ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారం ఒక కార్మికుడు రోజులో 8 గంటలు మాత్రమే పనిచేయాలి. వారానికి 48 గంటలకు మించకూడదు. అయితే ఈ 8 గంటల పనిని కూడా తగ్గించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రతిపాదన చేసింది. 8 గంటల పనివల్ల కార్మికులు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారనీ, అందువల్ల పనిగంటలు తగ్గించాలని సూచించింది.

ఉపాధికీ దెబ్బే

ఇప్పటి వరకు 24 గంటలు పనిచేసే సంస్థల్లో మూడు షిఫ్టుల పనివిధానం అమల్లో ఉంది.ఇప్పుడు కంపెనీలు ఆ విధానానికి స్వస్తి చెప్పి, అవే వేతనాలతో రెండు షిఫ్టుల్లో పనిచేయించుకుంటాయి. ఓవర్‌టైం లెక్కించి ఇస్తున్న కంపెనీలు వేళ్లమీద లెక్కపెట్టగలిగినవే ఉన్నాయి. ఈ విధానం వల్ల పరిశ్రమల్లో ఒక షిఫ్ట్ కార్మికులకు పనిలేకుండా పోతుంది. ఫలితంగా ఆయా కుటుంబాలు వీధిన పడతాయి. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంది. ఇప్పటికే ముగ్గురు చేయాల్సినపనిని ఇద్దరితోనే చేయించుకుంటూ పరిశ్రమలు ఒకరి జీతాలు మిగుల్చుకుంటున్నాయి. ఇలాంటి వాటిపై కార్మిక శాఖ మొద్దునిద్ర పోతున్నది.

కార్పొరేట్ల మాటల్లో

ఇన్ఫోసిస్ సంస్థ అధినేత నారాయణమూర్తి, ఎల్అండ్ టీ చైర్మెన్ సుబ్రహ్మణ్యం లాంటి వారు వారానికి 70 నుంచి 90 గంటల పని దినం ఉండేలా కార్మికుల చట్టాలు మార్పులు చేయాలని బాహాటంగానే మాట్లాడారు. ఇలాంటి వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చే జరిగింది. పనిగంటలు పెరిగితే కార్మికుల్లో సృజనాత్మకత పోతుందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. అయినా పాలకులు పనిగంటలు పెంచేందుకే మొగ్గుచూపారు.

అత్యంత ప్రమాదం : పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పది గంటల పనివిధానం అంటే కార్మికుల శ్రమను మరింత దోచుకోవడమే. మోడీ బాటలోనే రేవంత్‌రెడ్డి సర్కారు నడుస్తున్నది. లేబర్ కోడ్‌లు వద్దని పోరాటాలు చేస్తుంటే కార్మిక చట్టాలను సవరిస్తూ, సరళీకరిస్తున్నారు. కేవలం కార్పొరేట్లకు మరిన్ని లాభాలు తెచ్చిపెట్టడం కోసమే ఈ తాపత్రయం. దీనివల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. కేంద్రంలోని బీజేపీ సర్కారుపై కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం బేషరతు మద్దతు ప్రకటించాలి.

కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ

రాష్ట్రంలో పదిగంటల పనివిధానానికి ఇటీవల జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి రాష్ట్ర కార్మిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పనివేళల పరిమితిని 8 గంటల నుంచి 10 గంటలకు పెంచుతున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారంలో 48 గంటల పని దాటితే ఓవర్ టైం (ఓటీ) వేతనం చెల్లించాలని తెలిపారు. కార్మికులు ఆరు గంటలు పనిచేశాక కనీసం ఓ అరగంట విశ్రాంతి ఇవ్వాలనీ, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువసేపు పని చేయించరాదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పనివేళలు సవరించామని కార్మిక శాఖ పేర్కొంది.

# నీతులు చెప్పడమేనా.. పాటించరా?

## సమాజాన్ని కాపాడాల్సిన జర్నలిజం......... ఇప్పుడు తనను తాను కాపాడుకోవడానికి ప్రయత్నించాల్సిన దుస్థితికి చేరుకుంది

అమృత్ తెలంగాణ నువ్వు ఏదైతే కాదో, అదే నిరూపించడానికి నువ్వు ప్రయత్నిస్తావు' అంటాడు ఓషో. పేదవాడు సంపన్నుడిగా కనిపించడానికి ప్రయత్నిస్తే, సంపన్నుడు పేదవాడిగా కనిపించే ప్రయత్నం చేస్తాడు. కార్ల కంపెనీలను కూడా కొనేయగల వారెన్ బఫెట్ సెకండ్ హ్యాండ్ కారులో ప్రయాణిస్తుంటే, చిరుద్యోగి ఈఎంఐలతో యాపిల్ ఫోన్ కొంటాడు. ఓషో మాట అక్షర సత్యం అన్నట్టు.. విలువల గురించి ఎక్కువగా మాట్లాడే మీడియా, తాము మాత్రం ఆ విలువలను పాటించాల్సిన అవసరం లేదని భావిస్తున్నది.

మీడియా వివాదం– దాడి అంశంపై సదరు మీడియా యాజమాన్య ప్రతినిధి ఇటీవల ఓ సదస్సులో మాట్లాడారు. వివాదానికి కారణమైన అభ్యంతరకరమైన, అసహ్యకరమైన థంబ్ నెయిల్స్ గురించి ఆయన ఒక గమ్మత్తైన సంగతి బయటపెట్టారు. 'ఇలాంటి శీర్షికలు పెడితే పది లక్షల మంది చూశారు. ఇదేదో బాగుందని అలాంటివే పెడుతున్నారు. ఇవి యాజమాన్యం దృష్టికి రావు. ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే తొలగిస్తాం. గతంలో ఇలా తొలగించాం కూడా'.. ఇది ఆ చానల్ యాజమాన్యం ఇచ్చిన వివరణ. నిజాయితీగా తమ మీడియా వ్యాపారం గురించి ఆయన చెప్పుకొచ్చారు. మార్కెట్‌లో తమ న్యూస్ అమ్ముడుపోయి లాభం వస్తే చాలు ఎలాంటి నిరాధార ప్రసారానికైనా సిద్ధం అన్నమాట. విలువల గురించి ఎక్కువగా మాట్లాడే మీడియా విలువలను పూర్తిగా వదిలేసి వార్తా వ్యాపారం సాగిస్తున్నది.

'గోపాత్రుడు' అనే నవలలో మీడియా గురించి పతంజలి వ్యంగ్యంగా అద్భుతమైన మాట చెప్పారు. భూమి గుండ్రంగా ఉంటుం దా? బల్ల పరుపుగా ఉంటుందా? అనే అంశంపై ఓ గ్రామ సర్పంచ్ కోర్టులో కేసు గెలుస్తాడు. ఆయనను ఇంటర్వ్యూ చేయడానికి వెళ్లిన ఓ విలేకరి ఫొటోతో అయితే ఎంతనో, ఫొటో లేకుండా అయితే ఎంతో చెబుతాడు. 'నువ్వు నన్ను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చావు. నాకు డబ్బు ఇవ్వాలి కానీ, నన్ను అడగడం ఏమిటి?' అని సర్పంచ్ గడుసుగా ప్రశ్నిస్తాడు. 'నేను మీ వద్దకు వచ్చినా, మీరు నా వద్దకు వచ్చినా నాకే డబ్బులు ఇవ్వాలి. అందుకే ఈ రంగాన్ని ఎంచుకున్నాను' అని విలేకరి బదులిస్తాడు. ప్రింట్ మీడియా మాత్రమే ఉన్న రోజుల్లో స్థానిక విలేకరుల చిలక్కొట్టుడు గురించి ప్రముఖ పత్రికలకు సంపాదకునిగా చేసిన పతంజలి ఇలా రాస్తే.. ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియా యుగంలో మీడి యా మాఫియా గురించి ఏం రాసేవారో.

ప్రతి మీడియాకు ఏదో ఒక రాజకీయ పార్టీతో అవినాభావ సంబంధం ఉంది. కొన్ని మీడియాలకు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పార్టీతో అనుబంధం. అసలు మన దేశంలో మీడియా పుట్టిందే రాజకీయ పార్టీ కోసం. స్వాతంత్ర్యం కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ కోసం కాంగ్రెస్ నాయకులు పత్రికలను ప్రారంభించారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మొదలుకొని ప్రకాశం పంతులు వరకు పత్రికలను నడిపినవారే, జర్నలిస్టులుగా పని చేసినవారే. మహాత్ముని చేతుల్లో నుంచి గల్లీ రౌడీలు, హంతకుల చేతుల్లోకి రాజకీయం వచ్చినట్టు.. మీడియా సైతం మహాత్ముని కాలం నుంచి ఇప్పుడు డిజిటల్ యుగంలో బూతును అమ్ముకొనే వారి చేతుల్లోకి వచ్చిచేరింది. మీడియా రాజకీయ పార్టీల కోసం పని చేస్తున్నాయి. కొన్ని చానళ్లు ఏకంగా నాలుగైదు పార్టీల బాధ్యతలు మోస్తూ అఖిలపక్ష నాయకుల్లాగా మారాయి. ప్రధానంగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొన్ని చానళు కనీసం నాలుగు పార్టీల బాధ్యతలు మోస్తున్నాయి. ఆంధ్రాలో టీడీపీని ఆకాశానికి ఎత్తుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌ను దూషించాలి. తెలంగాణకు వచ్చేసరికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌లపై బురద చల్లుతూ కాంగ్రెస్‌ను భుజాన మోయాలి. టీడీపీ కోసం ఏర్పాటు చేసిన మీడియా తెలంగాణలో కాంగ్రెస్‌కు అండగా నిలవడం రాజకీయ విచిత్రం. అయితే ఇది కాంగ్రెస్ మీద అభిమానంతో కాదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నుంచి టీడీపీ నిష్క్రమించింది. దాంతో టీడీపీ అనుకూల మీడియా తెలంగాణలో కాంగ్రెస్ అనుకూల వైఖరిని అవలంబిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి అనుకూలంగా ఉండటంతో టీడీపీ మీడియా ఇక్కడ కాంగ్రెస్ పట్ల సానుకూల వైఖరిని అవలంబిస్తున్నది. తెలంగాణలో ఒక పార్టీ, ఆంధ్రాలో ఒక పార్టీకి అనుకూలంగా ఉండటంతో పాటు, అదే సమయంలో ఆంధ్రాలో ఒక పార్టీపై, తెలంగాణలో ఒక పార్టీపై బురదజల్లడం ఈ మీడియా బాధ్యత. ఈ బాధ్యత నెరవేర్చినందుకు ఆయా పార్టీల నుంచి ఏదో ఒక రూపంలో సహాయం అందుతుంది.

ప్రారంభంలో టీవీ చానళ్లు సంచలనాలకు ప్రాధాన్యత ఇస్తూ బురద జోలికి వెళ్లలేదు. యూట్యూబ్ చానళ్లు పెరిగాక ఈ సంస్కృతి పూర్తిగా మారిపోయింది. యూట్యూబ్ యంత్రాంగం ఉండదు, సాధన సంపత్తి ఉండదు. దీంతో వీటి ప్రభావం



కేఎల్ రాములు, అమృత్ తెలంగాణ, సీనియర్ రిపోర్టర్ స్టేట్ బ్యూరో

# బాసర ఆలయ పునర్నిర్మాణం చేపట్టకపోతే నిరాహార దీక్ష కు దిగుతా ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



బాసర లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా బాసర జులై 5 అమృత్ తెలంగాణ బాసర ఆలయం పునర్నిర్మాణం చేపట్టకపోతే వచ్చే దసరా, దీపావళి సమయం లో ప్రభుత్వ తీరు పై నిరహరదీక్షకు దిగుతానని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ హెచ్చరించారు.బాసర తహసీల్దార్ కార్యాలయం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులనుపంపిణి చేసినసందర్భంగా మీడియా తో మాట్లాడారు. బాసరఆలయఅభివృద్ధి పైఅప్పటి,ఇప్పటి ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. వెనక్కి మళ్ళిన 42 కోట్ల నిధులను సత్వరం ఇవ్వాలని లేని పక్షం లో ఆందోళన పోరాటాలను తీవ్రతరం చేస్తామన్నారు.. గతం లో ఆడెల్లికి, బాసర ఆలయానికి ఒక్కో దానికి 50 కోట్లు నిధులిస్తే.. అక్కడ పనులు జరిగాయాని, ఇక్కడ గత పాలకుల నిర్లక్ష్య ధోరణి వల్ల నిధులు వెనక్కి వెళ్ళాయన్నారు. 2027 లో గోదావరి పుష్కరాలు వస్తున్న తరుణంలో వెనక్కి మళ్ళిన 42కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి






నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మంత్రి వాకిటి శ్రీహరితో,మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

నిర్మల్ జిల్లా ముధోల్ జూలై 5 అమృత్ తెలంగాణ తెలంగాణ రాష్ట్రం నూతన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పశుసంవర్ధన శాఖ క్రీడా శాఖ మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,ని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి, మంత్రినీ శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో కుబీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్, కుబేర్ మాజీ సర్పంచ్ విజయ్ , సాయినాథ్ ఉన్నారు

# స్వచ్ఛత – పచ్చదనం – ఆరోగ్యంపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో శానిటేషన్, మిషన్ భగీరథ, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ వంటి కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఎక్కడైనా నీటి సరఫరాలో ఆటంకం ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి గ్రామంలో శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి–పొడి చెత్త వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలన్నారు. వనమహోత్సవంను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఒక వ్యక్తి – ఒక మొక్క అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో నీటి సరఫరా, శానిటేషన్, మొక్కల నాటింపు కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి లక్ష్యాలు సాధిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ, మిషన్ భగీరథ పనుల పురోగతిపై ప్రతివారం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, మొక్కల సంరక్షణకు గ్రామస్థాయిలో బాధ్యతలు అప్పగించాలన్నారు. పరిశుభ్రత, మంచి నీటి వినియోగం, పచ్చదనం పెంపుతో ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డిఆర్డిఓ నాగవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిదని మొక్కలు నాటి పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు శనివారం నిర్మల్ పట్టణంలోని దివ్య నగర్ పార్కులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, మహిళలు, కాలనీ వాసులతో కలిసి జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరిది బాధ్యతగా మొక్కలు నాటడమే కాదు, వాటిని రక్షించడంలో కూడా ప్రతి ఒక్కరు చొరవ చూపాలని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని, క్రమం తప్పకుండా నీరు పోయాలని, అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భాగ్యనగర్, శాంతినగర్ ప్రాంతాల్లోని పార్కులను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఉపయోగించని పార్కులను అభివృద్ధి చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి. రామారావు, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, బైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, మెప్మా పీడీ సుభాష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ కార్మికులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి...

## ముధోల్ నియోజకవర్గం అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి మంత్రిని కోరిన మాజీ ఎమ్మెల్యే




వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ ను సన్మానించిన దృశ్యం

నిర్మల్ జిల్లా ముధోల్ జులై 5 అమృత్ తెలంగాణ హైదరాబాద్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి,ని కలిసి కుబీర్ మార్కెట్ చైర్మన్ గ కళ్యాణ్, ని నియమించిన0దుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముధోల్ నియోజకవర్గం లో యూరియా డిఏపి కోరుత లేకుండా చూడాలని మంత్రి ని కోరటం జరిగింది మాజీ కేంద్ర మంత్రివర్యులు వేణుగోపాల చారి,ని కూడా అక్కడనే కలవటం జరిగింది మాజీ ఎమ్మెల్యే తో పాటు కుబీర్, మార్కెట్ చైర్మన్ గోనెలు కళ్యాణ్, కుబీర్ మాజీ సర్పంచ్ విజయ్, సాయినాథ్. పాల్గొన్నారు

# విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం: ఎస్ఎఫ్ఐ

భువనగిరి :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ భువనగిరి పట్టణ కార్యదర్శి ఈర్ల రాహుల్ అన్నారు. శనివారం రోజున స్థానిక ప్రిన్స్ చౌరస్తా వద్ద విద్యార్థులతో నిరసన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఈర్ల రాహుల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్నటువంటి రూ.8000 కోట్ల స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి అన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల కాకపోవడంతో సర్టిఫికెట్లు తీసుకుందామంటే ప్రయివేటు కాలేజీ యజమాన్యాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే బకాయిలు రాకపోవడంతో విద్యార్థుల దగ్గర సొంత డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, గురుకులాలకు ఎస్ ఎం హచ్ కాలేజీ హాస్టల్స్ కు సొంత భవనలు లేకపోవడంతో విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ఉంటూ చదువుకుంటున్నారన్నారు. లేదంటే రాబేయే రోజులలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ




ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కరట్లపల్లి భవాని శంకర్, పట్టణ సహాయ కార్యదర్శి సతీష్, నాయకులు సంతోష్, అభిషేక్, కార్తీక్, తిలక్, రాంచరన్, యెషవంత్, ఏలేశ్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిది : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : వనమహోత్సవాన్ని పురస్కరించుకుని సారంగాపూర్ మండలంలోని చించోలి గ్రామ పంచాయతీలో శనివారం సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఇతర అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, మొక్కలు నాటడమే కాక, వాటిని పరిరక్షించడంలోనూ ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మీకాంతం, ఇతర అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ బాధితులకు ప్రభుత్వం చేయూత.

జన్నారం : అమృత్ తెలంగాణ: జిల్లాలోని జన్నారం మండలం చింతగూడ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి పుదారి రాజన్న, కుమారుడు పుదారి సత్యనారాయణలు ఒకే రకమైన కండరాల వ్యాధితో బాధపడుతూ కదలలేని స్థితిలో ఉన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం హైదరాబాద్ నుండి అందిన సూచనల మేరకు జిల్లా యంత్రాంగం వారి కుటుంబాన్ని సంప్రదించి వివరాలు నిర్ధారించిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిగా కదలలేని స్థితిలో ఉన్న పుదారి రాజన్న, సత్యనారాయణల కుటుంబానికి తెల్ల రేషన్కార్డు ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నుండి చౌకధరల దుకాణం ద్వారా ప్రతి నెల 18 కిలోల బియ్యం అందించడం జరుగుతుందని, సత్యనారాయణ దివ్యాంగుల వర్గం క్రింద నెలకు 4 వేల 16 రూపాయలు చేయూత పెన్షన్ పొందుతుడగా, పుదారి రాజయ్య 2 వేల 16 రూపాయల వృద్ధాప్య పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం రాజయ్య వైకల్యాన్ని నిర్ధారించేందుకు స్లాట్ బుక్ చేసి వైకల్య ధృవీకరణ పత్రం జారీ చేయబడిన తరువాత వృద్ధాప్య ఫించన్ను దివ్యాంగ ఫించన్గా సవరించడం తీసుకుంటుందని, తద్వారా వారికి అధిక ఫించన్ మొత్తం లభిస్తుందని తెలిపారు. వారిరువురికి మెరుగైన చికిత్స అందించడం కోసం ప్రభుత్వ ఖర్చులతో వారిని హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్చాలని ప్రతిపాదించబడిందని, వారి సమ్మతితో లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేయబడుతుందని తెలిపారు. ప్రస్తుతానికి జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో వారి ఇంటి వద్ద పలియేటివ్ (ఉపశమనకారకం) కేర్ యూనిట్ ద్వారా జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించడంతో పాటు వారికి వీల్ చైర్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం వారి



చికిత్స కొరకు ఇప్పటికే చేసిన వైద్య బిల్లులతో ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# మెకానికల్ ఇంజనీర్ అనుమానాస్పద మృతి

నవాబుపేట : అమృత్ తెలంగాణ: మండల పరిధిలోని కాకర్జాల గ్రామ సమీపంలో గల మనోహర్ మినరల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ మెకానికల్ ఇంజనీర్ పూర్ణచందర్ రావు (43) తనకు కంపెనీ వారు కేటాయించిన గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా పమిడి ముక్కల మండల పరిధిలోని మంటాడ గ్రామానికి చెందిన కాశి పూర్ణచందర్ రావు ఈ సంవత్సరం ఏప్రిల్ నెల రెండవ తేది కంపెనీ యజమాని పవన్ గార్గ్ ద్వారా అపాయింట్మెంట్ ఆర్డర్ పొంది కంపెనీలో మెకానికల్ మేనేజర్ గా పనిచేస్తున్నారు. గురువారం యధావిధిగా కంపెనీలో విధులు నిర్వహించిన పూర్ణచందర్ రావు శుక్రవారం తెల్లవారేసరికి తనకు కంపెనీవారు కేటాయించిన గదిలో శవమై కనిపించాడు. అతడిని గదిలో విగత



జీవిగా చూసిన తోటి ఉద్యోగి మనోజ్ మృతుడి భార్య దీప్తికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మనోజ్ ద్వారా సమాచారం అందుకున్న ఆయన భార్య దీప్తి, బంధువులు అక్కడికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆయన మృతి అనుమానాస్పదంగా కనిపించడంతో తన భర్త మృతికి కంపెనీ యాజమాన్యమే కారణమని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతి విషయంలో కంపెనీ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి భార్య దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎం.విక్రమ్ తెలిపారు.

# ముధోల్ అభివృద్ధికి పెద్ద పీట..

ముధోల్ : అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ అభివృద్ధి పెద్ద పీట వేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ముధోల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రోజు కళ్యాణ్ లక్ష్మి,షాదిముభారక్, చెక్కు లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన 18 నెలల్లో ఐదుసార్లు కళ్యాణ్ లక్ష్మి, షాదిముభారక్ చెక్కులను పంపిణీ చేశానన్నారు. పెండింగ్లో ఉన్న మిగతా చెక్కులను త్వరలో లబ్ధిదారులకు అందజేయున్నట్లు ఆయన పేర్కొన్నారు. బ్రహ్మంన్ గావ్ లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు 5 కోట్ల 80 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ నిధులకు టెండర్ పూర్తి అయిన తర్వాత ఎత్తిపోతల మరుమ్మతుల పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. ఐదువేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న 28ప్యాకేజీ పనులు పున ప్రారంభం అయ్యేవిధంగా చూస్తానని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వ దృష్టికి తెస్తున్నానన్నారు. మరో మూడున్నర సంవత్సరం కాలంలో ముధోల్ ను సస్యశ్యామలం చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, ఆత్మ చేర్మన్ గన్ను నర్సారెడ్డి, తహశీల్దార్ శ్రీలత, నాయబ్ తహశీల్దార్ తెలంగ్ రావ్, ఆర్ఐ



నారాయణ రావు పటేల్, బిజెపి మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు గంట శ్రీనివాస్, విఠల్ రావు, నిమ్మ పోతన్న,దత్తాద్రి, రాం చందర్, సప్పటోల్ల పోతన్న, రమేష్, లక్ష్మినారాయణ,కాసారం శ్రీకాంత్, సంతోష్, సాయినాథ్, మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో పేదల బ్రతుకులు అస్తవ్యస్తం: సీపీఐ(ఎం)




భువనగిరి :అమృత్ తెలంగాణ: మోడీ పదేళ్ల పాలనలో దేశంలో పేదల బ్రతుకులు అస్తవ్యస్థంగా మారాయని, జులై 9న జరుగు దేశవ్యాప్త సమ్మెలో ప్రజలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, విద్యార్థి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు జీవిన వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలను, వ్యవసాయ కార్మికులను, కార్మికులను, రైతులను, విద్యార్థి, యువజనులను, మహిళలను మోసం చేసి బడా కార్పొరేట్ సంస్థలకు పచ్చ కార్పెట్ పరిచి లేబర్ కోడ్ లను, తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి, నూతన విద్యావిధానం పేరుతో విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కొత్త ఉద్యోగాలు కల్పించలేదని అన్నారు. వీటన్నిటి అమలుకై జులై 9న జరుగు దేశవ్యాప్త సమ్మెలో ప్రజలు వ్యవసాయ కూలీలు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

వీరితోపాటు రైతుసంఘం జిల్లా కార్యదర్శి మాటూరు బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, చేతి వృతిదారుల జిల్లా కన్వీనర్ బోలగాని జయరాములు, కేవీపీస్ జిల్లా అధ్యక్ష దుబ్బ లింగం, అన్నంపట్ల కృష్ణ, రజక సంఘం జిల్లా కార్యదర్శి వడ్డేబోయిన వెంకటేష్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి, నాయకులు, పల్లెర్ల అంజయ్య, కల్లూరి నాగమణి, కొండమడుగు నాగమణి, సిల్వేరు ఎల్లయ్య, కొండాపురం యాదయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పేద విద్యార్థినులకు అండగా సుదర్శన్ ఎడ్యుకేషన్ సొసైటీ

అచ్చంపేట :అమృత్ తెలంగాణ: నల్లమల్ల ప్రాంతం అచ్చంపేట నియోజకవర్గంలోని ఉన్నత చదువులు చదువుతున్న బాలికలకు సుదర్శన్ ఎడ్యుకేషన్ సొసైటీ అండగా నిలుస్తోంది. గత 20 ఏళ్లుగా ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థినిలకు ఆర్థిక సాయం చేస్తూ.. విద్యపైన భరోసా కల్పిస్తున్నారు. అందులో భాగంగానే శనివారం అమ్రాబాద్ మండలం మాధవన్ పల్లి గ్రామానికి చెందిన సి.అంకిత ఎంబిబిఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న బాలికకు సుదర్శన్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ గార్లపాటి సుదర్శన్ నుంచి రూ.30 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అమ్మాయి ఐదేళ్లపాటు ఎంబిబిఎస్ చదువు పూర్తి అయ్యేవరకు ప్రతి ఏడాది రూ.30 వేల చొప్పున సొసైటీ ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థినిలు ఉన్నత చదువులు చదువుతున్న వారికి సొసైటీ ఆర్థిక సాయం చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు కాలంలో వారు కూడా పేదరికంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినిలకు భరోసాగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో మహాత్మ జ్యోతిరావు పూలే



ప్రిన్సిపాల్ రజిత, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్ తదితరులు ఉన్నారు.

# సుమారు రెండు నెలలు మృత్యువుతో పోరాటం

ఉప్పునుంతల :అమృత్ తెలంగాణ: ఉప్పునుంతల మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గుడి సత్యం (36 ) ఏప్రిల్ 29 న రాత్రి సమయంలో బైక్ పై కల్వకుర్తి వెళ్తున్న తరుణంలో పోల్కంపల్లి కొండారెడ్డిపల్లి రోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్ప రాత్రి కనబడక జరిగిన బైకు ప్రమాదంలో సత్యం తీవ్రంగా గాయపడ్డాడు.గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్ సహాయంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ లోని చింతకుంట్ల నాసా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు ఒక నెల 15 రోజులు అక్కడ ట్రీట్మెంట్ అందించారు అనంతరం పరిస్థితి విషమించడంతో జూన్ 15 న ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు అక్కడ 12రోజులు మృత్యువుతో పోరాడి జూన్ 27న చనిపోయినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.పేదింటి వారైనా స్థోమతకు మించి 25 లక్షలు ఖర్చు చేసినా ప్రాణం దక్కలేదని కన్నీరు మున్నీరుగా విలపించారు. శనివారం దశదిన కర్మ కావడంతో భార్య అరుణకు గ్రామస్థులు 10 వేలు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు.మృతునికి ముగ్గురు చిన్నపిల్లలు ఉండటంతో ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ వర్కింగ్ మండల ప్రెసిడెంట్ బోడ శేఖర్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి,రేనయ్య యాదవ్,మల్లయ్య యాదవ్ తదితరులు కోరారు.



# 108 అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం..తల్లి బిడ్డ సురక్షితం

భీంగల్:అమృత్ తెలంగాణ: 108 అంబులెన్స్లో ఓ మహిళ శిశువుకు జన్మించిన ఘటన శనివారం భీంగల్ మండలంలో చోటుచేసుకుంది. రహత్ నగర్ గ్రామానికి చెందిన సిరికొండ శిరీష(32)కు..పురిటి నొప్పులతో బాధపడుతుండగా..కుటుంబసభ్యులు..108 అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేశారు. దీంతో తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో సదరు మహిళ అంబులెన్స్లోనే ఆడ శిశువుకు జన్మించింది. ఇద్దరు సురక్షితంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం ఆర్మూర్ ఏరియా దవాఖానుకు తరలించామని అధికారులు తెలిపారు. అత్యవసర సమయంలో చాకచాక్యంగా వ్యవహరించి..తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడిన అంబులెన్స్ సిబ్బందిని బాధిత కుటుంబసభ్యులు మెచ్చుకున్నారు.



# కామారెడ్డిలో సీఈఐఆర్ ద్వారా 130 మొబైల్ ఫోన్ల రికవరీ..



కామారెడ్డి :అమృత్ తెలంగాణ: సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సిఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 130 మొబైల్ ఫోన్లను ( సుమారు రూ.17 లక్షల విలువగల) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ మొబైల్ రికవరీలలో రాష్ట్రంలోని జిల్లాలలో కమిషనరేట్లను మినహాయిస్తే, కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని అని అన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. మొబైల్ పోయిన లేదా చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ కు వెళ్ళి దరఖాస్తు ఇవ్వాలి సిమ్ కార్డ్ బ్లాక్ చేసి అదే నంబరు గల కొత్త సిమ్ కార్డ్ తీసుకోవాలన్నారు. తద్వారా పోయిన మొబైల్ ఫోన్ల ఐఎంఈఐ వివరాలు, సీఈఐఆర్ వెబ్సైట్ లో బ్లాక్ చేయడం వలన పోగొట్టుకున్న మొబైల్ సులబంగా దొరికే అవకాశం ఉందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయములో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ బాలరాజు, 10 మంది కానిస్టేబుల్స్ తో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు.

గత (15) రోజులలో ఈ టీం అధికారులు 130 ఫోన్ లను రికవరీ చేయడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా 130 మొబైల్ ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టీం సభ్యులు అందరినీ అభినందిస్తున్నానన్నారు. ఇప్పటి వరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలిజేయడం జరుగుతుంది. వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్ఐ బాలరాజ్ ని సంప్రదించి (8712686114) ఫోన్ కు సంభంధించిన వివరాలు చూపించి తమ మొబైల్ ను తీసుకోవచ్చు అన్నారు.

# పరిశుభ్రంగా ముస్తాబవుతున్న జుక్కల్ బస్టాండ్



జుక్కల్ :అమృత్ తెలంగాణ: జుక్కల్ మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణానికి మహర్దశ కలగడంతో, పరిసర ప్రాంతమంతా మట్టితో కప్పివేసి గుంతలను పూడ్చేసారు. బస్టాండు ఖాళీ ప్రదేశంలో మొక్కలను నాటేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు. మండల కాంగ్రెస్ యూత్ నాయకుడు సతీష్ పటేల్, కార్యకర్తలు మనోహర్ పటేల్, గత మూడు రోజులుగా ఈ ప్రాంగణాన్ని పర్యవేక్షించారు. బురద ఉన్న ప్రదేశాలను మట్టితో కప్పి పనులను చేయిస్తున్నారు. దీంతో బస్టాండు ప్రాంతమంతా సుందరంగా కనిపిస్తోంది. ప్రయాణికుల సౌకర్యార్థం అక్కడున్న బోరును రిపేరు చేసి, మంచినీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

బస్టాండు రూపు రేఖలు మారుతున్న దృశ్యాలను ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఇందుకు కారణమైన ఎమ్మెల్యే కృషి పట్ల నాయకులకు, అధికారులకు మండల ప్రజలు, ప్రయాణికులు అభినందనలు తెలియజేస్తూ.. సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


# దోమల నివారణకు ఆయిల్ బాల్స్ విడుదల



కమ్మర్ పల్లి :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వదిలినట్లు పంచాయతీ కార్యదర్శి గంగ జమున తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులతో ఇందుకోసం అవసరమైన ఆయిల్ బాల్స్ తయారు చేయించినట్లు తెలిపారు. శనివారం అట్టి ఆయిల్ బాల్స్ ను మురుగునీటి కుంటల్లో, వర్షపు నీరు చేరే ప్రదేశాల్లో పంచాయతీ సిబ్బందితో వేయించినట్లు తెలిపారు.ఆయిల్ బాల్స్ ను వదలడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా దోమల లార్వ చనిపోతుందన్నారు. ఆయా ప్రదేశాల్లో పదుల సంఖ్యలో ఆయిల్ బాల్స్ ను వదిలినట్లు ఆయన వివరించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపిన ఆయన ఇప్పటికే పలుమార్లు గ్రామంలో పాగింగ్ చేయించినట్లు వివరించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా, చెత్తాచెదారం మురికి కాల్వలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. తద్వారా ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా తమను తాము కాపాడుకోవచ్చు అన్నారు.

# పెద్ద చదువులకు అర్హత సాధించిన పేద విద్యార్థులు






అశ్వారావుపేట:అమృత్ తెలంగాణ:నేడు పెద్ద చదువులుగా భావించే సాంకేతిక సమాచారం విద్యను అందించే విశ్వవిద్యాలయం లో ఉన్నత విద్యను చదివేందుకు అశ్వారావుపేట పేద విద్యార్థులు కొందరు ఎంపికయ్యారు. ఆర్జీయూకేటీ %-% ట్రిపుల్ ఐటీ(రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ - ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్) తెలంగాణ, నిర్మల్ జిల్లాలోని బాసర రాష్ట్ర విశ్వవిద్యాలయం శుక్రవారం ప్రకటించిన అర్హులు జాబితాలో మండలానికి చెందిన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కు చోటు దక్కింది.అశ్వారావుపేట మండలం లోని నాలుగు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యను అభ్యసించిన పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన పదిమంది బాలికలుఅక్కడ సీట్ లు సాధించారు.అధునాతన సాంకేతికసమాచారం విద్యను బోధించే అత్యంత ప్రాముఖ్యత గల ఈ విశ్వవిద్యాలయం లో వివిధ సాంకేతిక కార్యక్రమాలలో అండర్ గ్రాడ్యుయేట్,పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీల ను అందించే ఈ కళాశాలలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఎంపిక అవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.తెలంగాణలోని ప్రతిభావంతులైన గ్రామీణయువత విద్యాఅవసరాలనుతీర్చడం ఈ విశ్వవిద్యాలయం ఆశయం. విద్యతో పాటు, ఈ సంస్థ అదనపు విద్యా కార్యకలాపాలనువిద్యలో తప్పనిసరి భాగంగా బోధిస్తుంది.కళలు, గాత్రసంగీతం,కూచిపూడి నృత్యం, యోగా వంటి వివిధ అదనపు విద్యా కార్యకలాపాలను నిర్వహిస్తుంది. భారత దేశంలోని శాస్త్రీయ కళారూపాలను పాఠ్యాంశాల్లో చేర్చాలనే చొరవను రూపొందించారు.అంతః ప్రజ్ఞ, ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి సాంకేతిక - సాంస్కృతిక ఉత్సవాన్ని ఈ కళాశాలలో నిర్వహిస్తారు. ఇంత విశిష్ట విశ్వవిద్యాలయంలో అశ్వారావుపేట బాలికలు అడుగిడుతున్నారు. అశ్వారావుపేట బాలురు పాఠశాలలో చదివిన శాంతి, శైలజ, ఊహ, అఖిల, కీర్తి శ్రీ, విజయ లక్ష్మిలు, అశ్వారావుపేట బాలికల పాఠశాలలో చదివిన కే.శ్రావణి, షేక్ యాస్మిన్ లు, మామిళ్ళవారిగూడెం పాఠశాల విద్యార్థిని ఏ.రవళి, గుమ్మడి వల్లి పాఠశాల విద్యార్థిని డి.చందన లు బాసరలో సీట్ లు సాధించారు. బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్ సాధించిన విద్యార్థులు మొత్తం బాలికలే కావడం, అందరు రోజువారీ వ్యవసాయ కూలీ, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులే కావడం గమనార్హం. ఈ విద్యార్థులను ఎంఈఓ ప్రసాదరావు,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.హరిత, ఎన్.కొండలరావు, తాళ్ళపాటి వీరేశ్వరరావు, ఉపాధ్యాయులు నరసింహారావు, కిశోర్ బాబు లు అభినందించారు.

# వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ అరుణ్ కుమార్



పెద్దకొడప్ గల్ : అమృత్ తెలంగాణ: మండలంలోని అంజనీ గేట్ జాతీయ రహదారి 161 పై శనివారం రోజున ఎస్సై అరుణ్ కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా మాట్లాడుతూ రోడ్డుపై వాహనాల సంఖ్య పెరుగుతుందని, రద్దిగా ఉండే సమయంలో మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడపడం కూడా పెరుగుతుందని, దీనివల్ల ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. వాహనాలు నడిపే ప్రజలు రోడ్డు నిబంధన, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ వాడకం, 18 సంవత్సరాల లోపు (మైనార్టీలు) ద్విచక్ర వాహనాలు గనుక ఇస్తే వాహనదారునిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# అందాల రాశి ఇన్ని ఆఫర్లు వద్దనుకుందా..?




ఢిల్లీ భామ రాశి ఖన్నా కెరీర్ మొదలు పెట్టింది హిందీ సినిమాలతోనే అయినా ఆమెని ఆదరించింది మాత్రం సౌత్ ఆడియన్స్ అని చెప్పొచ్చు. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ ఆమెను హీరోయిన్ గా గుర్తింపు ఇచ్చారు. మనం సినిమాలో ఏదో ఒక చిన్న పాత్ర చేసిన ఆమెను అవసరాల శ్రీనివాస్ ఊహలు గుసగుసలాడే సినిమాలో హీరోయిన్ గా చేశాడు. అంతకుముందే మద్రాస్ కేఫ్ సినిమాలో నటించింది రాశి ఖన్నా. కెరీర్ లో ఏ సినిమా సక్సెస్ అవుతుందో ఏ సినిమా ఫెయిల్ అవుతుందో చెప్పడం కష్టం.అయితే ముందు జడ్జ్ చేసి కొన్ని సినిమాల్లో తన పాత్ర నచ్చక చేయనని చెప్పేసిందట రాశి ఖన్నా. విచిత్రం ఏంటంటే అందులో చాలా సినిమాలు హిట్ అయినవి ఉండటమే.. రాశి ఖన్నా వదిలేసిన సినిమాలు కొన్ని హిట్ గా నిలిచాయి. అందులో మారుతి డైరెక్షన్ లో వచ్చిన మహానుభావుడు. శర్వానంద్ హీరోగా చేసిన ఈ సినిమాలో రాశి ఖన్నా పాత్ర నచ్చక సినిమా చేయనందట ఆ ఛాన్స్ మెహ్రీన్ కి వెళ్లింది. ఆమె ఖాతాలో ఒక మంచి హిట్ నిలిచింది. ఇదే కాదు .2 సినిమాలో హనీ పాత్రకి కూడా ముందు రాశి ఖన్నానే అనుకున్నాడట డైరెక్టర్ అనీల్ రావిపుడి. కానీ రాశికి ఆ క్యారెక్టర్ కూడా నచ్చలేదట. అలా అమ్మడు ఆ ఛాన్స్ కూడా వదులుకుంది. రాశి ఖన్నా మిస్ చేసుకున్న సూపర్ హిట్ సినిమాల్లో ఒకటి గీతా గోవిందం. విజయ్ దేవరకొండ రష్మిక జంటగా నటించిన ఆ సినిమా 100 కోట్లని కలెక్ట్ చేసింది. ఆ సినిమాలో రష్మికకు ముందు రాశికి ఆఫర్ వచ్చిందట. కానీ ఆమె వేరే సినిమాలతో బిజీగా ఉండటం వల్ల గీతా గోవిందం మిస్ చేసుకుందట. అలా రష్మికకు ఓ సూపర్ హిట్ దొరికేసింది. బెల్లంకొండ శ్రీనివాస్ రాక్షసుడు సినిమాలో కూడా అనుపమకు ముందు ఆఫర్ రాశికే రాగా ఆమె ఏవో కారణాల వల్ల కాదన్నదని తెలుస్తుంది. మజిలీ సినిమాలో దివ్యాన్ష కౌశిక్ నటించిన పాత్రకు రాశి ఖన్నాని అడిగారట. కానీ ఆ పాత్ర రాశి ఖన్నా చేయనని చెప్పిందట. తమిళంలో శింబు హీరోగా చేసిన మానాడులో హీరోయిన్ గా కూడా ఆమె ఛాన్స్ మిస్ చేసుకుంది.

# అందరూ నా పనైపోయిందనుకున్నారు: సేతుపతి



విజయ్ సేతుపతి హీరోగా నటించిన సినిమాలు మాత్రం ఫ్లాపులుగా నిలవడంతో అందరూ హీరోగా ఇక సేతుపతి పనైపోయిందనుకున్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్ సేతుపతి మహారాజా సినిమాకు ముందు హీరోగా చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతూనే వచ్చాయి. విడుదల1, విడుదల2కు పేరైతే వచ్చింది కానీ కమర్షియల్ గా మాత్రం ఆ రెండు సినిమాలు పెద్దగా సక్సెస్ అవలేదు. కానీ సేతుపతి విలన్ గా చేసిన సినిమాలు మాత్రం మంచి ఆదరణ పొందాయి. విజయ్ సేతుపతి హీరోగా నటించిన సినిమాలు మాత్రం ఫ్లాపులుగా నిలవడంతో అందరూ హీరోగా ఇక సేతుపతి పనైపోయిందనుకున్నారు. అలాంటి టైమ్ లో సేతుపతి కెరీర్ లో 50వ సినిమాగా వచ్చిన మహారాజా సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. సేతుపతి కెరీర్ లోనే మహారాజా మైల్ స్టోన్ మూవీ అయిపోయింది. కెరీర్ ముగిసిందనే టైమ్ కు మహారాజా సినిమా తనను మళ్లీ నిలబెట్టిందని రీసెంట్ గా సేతుపతి ఓ వేడుకలో తెలిపారు. స్టార్ బోల్డ్ ట్రీట్ ఓ అవార్డు ఫంక్షన్ లో మహారాజా మూవీకి బెస్ట్ యాక్టర్ అవార్డు రాగా, అవార్డు తీసుకున్న తర్వాత సేతుపతి ఈ మూవీ గురించి మాట్లాడి తన సంతోషాన్ని పంచుకున్నారు. 2-3 ఏళ్లుగా తన నుంచి వచ్చిన సినిమాలేవీ బాగా ఆడలేదని, సరైన టైమ్ లో వచ్చిన మహారాజా తనను నిజంగానే మహారాజాను చేసిందని, ఈ మూవీకి ఇన్ని ప్రశంసలొస్తాయని ఊహించలేదని, చైనాలో ఎక్కువ కలెక్షన్స్ సాధించిన చిత్రంగా మహారాజా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో ఎలాంటి సాంగ్స్, అనవసరమైన ఫైట్స్ లేకుండా కేవలం కథతోనే మహారాజా సినిమాను నడిపించాడు డైరెక్టర్ నిథిలన్. కథతో పాటూ సేతుపతి తన నటన, స్క్రీన్ ప్రెజెన్స్ తో సినిమాను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లాడు. తమిళంలోనే కాకుండా తెలుగులో కూడా మహారాజా సినిమాకు మంచి కలెక్షన్లు వచ్చాయి. ఇదిలా ఉంటే విజయ్ సేతుపతి మహారాజా తర్వాత కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. వచ్చిన కథలన్నీ ఒప్పుకోకుండా, బాగా నచ్చిన కథల్ని మాత్రమే సెలెక్ట్ చేసుకుంటున్నారు. కథ బాగుండి తన పాత్రకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్నే ఎంచుకుని వాటిని మాత్రమే చేయాలని సేతుపతి నిర్ణయించుకున్నారట. ఇక మీదట రెగ్యులర్ గా ఉండే విలన్ పాత్రలకు కూడా సేతుపతి నో చెప్తాడని అంటున్నారు.

# శ్రీలీల మళ్లీ పుంజుకుంటుందిగా..!



కెరీర్ లో ఎంత తక్కువ టైం లో స్టార్ క్రేజ్ వచ్చిందో అంతే త్వరగా డౌన్ ఫాల్ అయ్యింది శ్రీలీల. కొద్దిపాటి గ్యాప్ తో మళ్లీ శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటుంది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన శ్రీలీల మాస్ మహరాజ్ రవితేజ ధమాకాతో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా తర్వాత అమ్మడు వరుస సినిమా ఛాన్స్ లు అందుకుంది. ఐతే చేయడానికి అరడజను సినిమాల దాకా చేసినా అందులో భగవంత్ కేసరి, గుంటూరు కారం తప్ప మిగతా సినిమాలన్నీ కూడా డిజప్పాయింట్ చేశాయి. కెరీర్ లో ఎంత తక్కువ టైం లో స్టార్ క్రేజ్ వచ్చిందో అంతే త్వరగా డౌన్ ఫాల్ అయ్యింది శ్రీలీల. కొద్దిపాటి గ్యాప్ తో మళ్లీ శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటుంది. స్టార్ బోల్డ్ ట్రీట్ ప్రస్తుతం రవితేజతో మాస్ జాతర సినిమా చేస్తున్న శ్రీలీల నితిన్ రాబిన్ హుడ్ తో ఈ మంత్ ఎండ్ రాబోతుంది. ఈ సినిమాలతో పాటుగా అమ్మడు లేటెస్ట్ గా మరో లక్కీ ఛాన్స్ కొట్టేసిందని తెలుస్తుంది. ఇప్పటికే తెలుగుతో పాటు హిందీలో కార్తీక్ ఆర్యన్ తో ఒక సినిమా చేస్తుంది అమ్మడు. కోలీవుడ్ లో కూడా శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమాలో అవకాశం దక్కించుకుంది. వీటితో పాటు మళ్లీ తెలుగు స్టార్ ఛాన్స్ లు వరుస కడుతున్నాయి. ఈ సినిమాలతో మళ్లీ శ్రీలీల పుంజుకుంటుందని చెప్పొచ్చు. శ్రీలీల డ్యాన్స్ సినిమాలకు అడ్వాంటేజ్ అవుతుంది. ఆమె ఉంటే మ్యూజిక్ అదిరిపోతుంది.




# ఇస్మార్ట్ బ్యూటీ.. ఇచ్చి పడేస్తుంది..!



గ్లామర్ ఫీల్డ్ లో గెలవాలంటే వారికి తోచినట్టు కాదు ప్రేక్షకులకు నచ్చినట్టు ఉండాల్సి ఉంటుంది. ఎప్పుడూ కేవలం నటనతోనే ఆదరిస్తానంటే ఒప్పుకోరు హీరోయిన్ అన్నాక గ్లామర్ యాంగిల్ కూడా చూపించాల్సిందే. ఇప్పుడొస్తున్న భామల్లో అలా ఫిక్స్ అయి వచ్చే వారే ఎక్కువమంది ఉన్నారు. వారిలో ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ ఒకరు. సుధీర్ బాబు సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నభా మొదటి సినిమాతోనే తనలో నటిని పరిచయం చేసి మెప్పించింది. ఇక పూరీ చేతిలో పడ్డాక అమ్మడి ఫేట్ మారిపోయింది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఊర మాస్ పాత్రలో నభా నటేష్ అదరగొట్టేసింది. ఆ సినిమాతో నభాకి రావాల్సిన క్రేజ్ వచ్చేసింది. అయితే అలా వచ్చిన ఆ పాపులారిటీని అమ్మడు సరిగా వాడుకోలేకపోయింది. యువ హీరోలతో సినిమాలైతే చేస్తుంది కానీ కథల సెలక్షన్స్ కుదరక అమ్మడు కెరీర్ లో డీలా పడ్డది. నితిన్ మాస్ట్రో తర్వాత చేతిలో సినిమాలేవి లేకపోయినా సోషల్ మీడియాలో రకరకాల ఫోటో షూట్స్ తో మెప్పిస్తుంది నభా నటేష్. క్రిస్ మస్ సందర్భంగా నభా నటేష్ మరోసారి తన లేటెస్ట్ ఫోటో షూట్ తో రెచ్చిపోయింది. తొడల అందాలు కనిపించేలా అమ్మడు చేస్తున్న ఈ గ్లామర్ షో సోషల్ మీడియాలో అమ్మడి మైలేజ్ కి మంచి హైప్ ఇస్తున్నాయని చెప్పొచ్చు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com